# శప్తభూమి

రాయలసీమ చారిత్రక నవల

బండి నారాయణస్వామి



తానా

బహుమతి నవల

# SEPTABHOOMI

*TANA Prize Winning Novel*

*by* **Bandi Narayana Swamy**
6-4-296, 4th Cross, Maruthi Nagar
Anantapuram, Andhra Pradesh.
**Email: bandinarayanaswami@gmail.com**

© Author

***Released***
**On 25th December 2017 at Hyderabad**

*First Publication: December, 2017*
*Publication Number: 7*

*Publication*
**TANA (Telugu Association of North America) Publications**
20374 Buckthorn Court, Mundelein, Illinois, 60060, USA

*Local Address*
AG-2, 'A' Block, Mathrusri Apts., Hyderguda,
Hyderabad-500 029. Ph.: 040-2324 4088

*Cover Painting*
**P.S. Chary**

*Cover Design*
**Akshara Creators,** Hyderabad
Email: sakshara@gmail.com

*Copies available at*
**Visalandhra Publishing House,** Vijayawada and its Branches in Andhra Pradesh; **Navachetana Publishing House,** Hyderabad and its Branches in Telangana; **Navodaya Book House,** Kachiguda, Hyderabad; **Prajashakti Book House,** Hyderabad and its branches in Andhra Pradesh

*e-book:* **www.kinige.com**

*Composed at* **Akshara Creators,** Hyderguda, Hyderabad
Ph.: 040-23244088

*Printed at* **Charita Impressions**
Azamabad Industrial Area, Hyderabad, India.
Ph.: 040-2766 78411

**₹125 $ 10**

# 1

అది పజ్జెనిమిదవ శతాబ్దం.

క్రీ.శ. 1 775వ సంవత్సరం

అప్పుడు...

అనంతపురం సంస్థానాన్ని హండేరాజు సిద్ధరామప్పనాయుడు పరిపాలిస్తున్నాడు. అతడు రాజ్యానికి వచ్చి ఇరువది రెండేండ్లు అయింది. మునుపు అతనికి దళవాయిగా అతని మేనమామ కరిహుళి బసవప్ప వుండేవాడు. అతడు చనిపోయిన తరువాత సుబ్బరాయుడు సంస్థానానికి దళవాయి అయినాడు. దళవాయి అంటే; దళపతి మాత్రమేకాదు. అతడు సంస్థానానికి ప్రధానమంత్రి కూడా!

ఆ దినం నరక చతుర్దశి.

అనంతపురంలో పండగ సంరంభం సద్దుమణిగి వుంది.

హండేరాజుల కోటలో కాలపుగంటలు మోగినాయి.

కోటకు తూర్పున బుక్కరాయ సముద్రం చెరువు!

చెరువుకట్ట కింద వరిమళ్ల నుంచి పైరగాలి తోలుతూ వుంది.

ఆకాశంలో మిణుకుమిణుకు మంటున్నాయి చుక్కలు.

చుక్కలకు సానపెడుతున్నాయి చిక్కని చీకట్లు.

చీకటికి గొంతుగా మారినాయి కీచురాళ్ల శబ్దాలు.

అది రహస్యమొకటి రూపం తీసుకుంటున్న ఘడియ!!

తీతువుపిట్ట ఒకటి ఆందోళనతో అరిచి, ఆకాశానికి అడ్డంపడి పారిపోయింది.

నలుగురు దుండగులు రాయబారం తూము దగ్గర కట్టపైకి ఎగబాకుతున్నారు. వారు చీకట్లో కదులుతుంటే, చీకటికే కదలిక వచ్చినట్టు వుంది. వారి చేతుల్లో చెరువుకట్టను తెగగొట్టే పనిముట్లు వున్నాయి. పలుగు, పార, గడారు, పికాసి! కొన్నాళ్ల కిందట అకాలవర్షాలు కురిసి; అనంతపురం యెగువ రామగిరి, బద్దలాపురం, కోనాపురం- ఈ మూడు గ్రామాల చెరువులు తెగిపోయినాయి. ఆ ప్రవాహమంతా వచ్చిపడి,

రెండు మరవలూ పట్టకుండా వుంది బుక్కరాయ సముద్రం చెరువు. వానలు వెనుక బట్టి చెరువుకు ప్రకృతిగండం గడిచిపోయింది కానీ; మానవ గండం పొంచే వుంది.

అది శాలివాహన శకవర్షంబులు 1286.అప్పట్లో బుక్కరాయల ప్రధానిగా చిక్కప్ప వడయరు వుండేవాడు. అనంతపురానికి పదికోసుల మీద కంబుగిరి శ్రీ స్వామి కొండల్లో పుడుతుంది పాండునది. ఈ పాండునదికి అడ్డుకట్టగానే, చిక్కప్ప వడయరు తన రాజుపేరిట చెరువును నిర్మాణం చేసివున్నాడు.

కట్టకింద వరిభూముల్లో హండేవారి రాచభూములు వున్నాయి. రాచవీధిలోని విరూపాక్ష దేవాలయానికీ, బుక్కరాయ సముద్రం వీరభద్రస్వామి ఆలయానికీ గుడి మాన్యాలు వున్నాయి. కొంతమంది రాచప్రముఖులకు, హండే దొరల నుంచి ఈనాము గా సంక్రమించిన చేనుమాన్యాలు వున్నాయి. రైతుల కౌలు భూములు వుండనే వున్నాయి. రాచభూముల నుంచీ వచ్చే ధాన్యం రాజకుటుంబపు ఖర్చువెచ్చాలకు పోతే; కౌలుదార్ల నుంచి వసూలయ్యే ధాన్యంతోనూ, పన్నులతోనూ సంస్థానం పరిపాలన నడుస్తుంది. ఈ మాగాణి భూములవల్లే హండే సంస్థానం సుసంపన్నంగా వుంది.

హండే రాజుల మూలపురుషుడు హనుమప్పనాయుడు. అతడు నందేల నుండి వచ్చి బుక్కరాయసముద్రంలో కోట కట్టడానికి కారణం, ఈ దొడ్డ తటాకమే! చెరువుకు ఉత్తరభాగాన ఒక ఘడియకాలం దూరంలో నల్లగుట్ట మీద సిద్ధ రామేశ్వర మఠం నిద్రపోతూ వుంది. హరిహరరాయల కాలంనాటి కాశీ విశ్వేశ్వరాలయంలో ప్రమిదలు నిద్రకొచ్చి జోగుతున్నాయి. ఖంగు ఖంగుమంటూ రాయబారం తూము దగ్గర చెరువును తెగగొడుతున్న శబ్దం! కుక్కలు ఎక్కడివో భౌమన్నాయి. కొంచెం కదిలిస్తే కిందపడే నీళ్లదుత్త మాదిరి వుంది చెరువు. చెరువుకట్ట తెగిపోతే వరిమళ్లూ వుండవు, హండేవారి బొక్కసమూ నిండదు. చెరువు కింద బుక్కరాయసముద్రం గ్రామం మచ్చుకు కూడా మిగలదు.

✦ ✦ ✦

గొర్లకుక్కలు భౌమనగానే ఉలిక్కిపడి కళ్లు తెరచినాడు బిల్లే ఎల్లప్ప. అతడు చెరువుకట్ట కింద ముసలమ్మకట్టకు ఆనుకుని గొర్లు తోలుకున్నాడు. బిల్లే ఎల్లప్ప, ఇరవై ఏండ్ల పడుచువాడు. అతనికి మేనమామ వున్నాడు. ఆ మేనమామకు కూతు రుంది. ఆమె పేరు ఇమ్మడమ్మ. ఇమ్మడమ్మ అంటే బిల్లే ఎల్లప్పకు నెరులు. ఆమెను మనువాడి స్వంతం చేసుకోవాలని అతని అభీష్టం. ఆ మరదలి కోసం కలలు కంటూనే ఇప్పుడతడు కుక్కల అరుపులతో మేలుకున్నాడు. అంటే నడుంవాల్చి పడుకున్న నిద్ర నుంచి కాదు, కర్రను గడ్డం కింద ఊదబొడుచుకుని పడే కునుకిపాట్ల నుంచి! అది కోడినిద్ర.

ఇమ్మడమ్మ సమర్త కాకముందు బిల్లే ఎల్లప్ప తరచుగా మేనమామ గ్రామానికి పోయేవాడు. కానీ, ఆమె పెద్దమనిషి అయిన తరువాత మేనమామ ఊరికి రాకపోకలు తగ్గిపోయినాయి. అతడు నిన్నగాక మొన్న జరిగిన కురువల పెద్దపరసలోనే ఇమ్మడమ్మను చివరిసారిగా చూసినది. అది పండ్రెండేండ్లకు ఒకసారి వచ్చే పెద్దపరస. గొర్రెల మేపుమీద వివిధ ప్రాంతాలకు తరలిపోయిన కురువ కుటుంబాలన్నీ ఆ పరస లో కలుసుకుంటాయి. రజస్వలై బంగారుఛాయతో మిసమిసలాడే ఇమ్మడమ్మను పరసలో చూసినప్పటి నుంచీ అతని మనసు మనసులో లేదు. ఇమ్మడమ్మ వైపే పరుగులు పెడుతూ వుంది.

కుక్కలు మొరుగుతున్నాయి. అవి చెరువువైపే చూసి మొరుగుతున్నట్లు న్నాయి. బిల్లే ఎల్లప్ప అనుమానంగా చూస్తున్నాడు. అతడు చల్లాడం తొడుక్కున్నాడు. మెయి మీద వేరే ఆచ్ఛాదన లేదు. మొలలో పిల్లనగ్రోవి వుంది. తల నుంచి కొప్పెర వేసుకున్న గొంగడి వెనుకగా వేలాడుతూ వుంది. మెడలో గిరిజ పూసలపేరు వుంది. జల్లి చిక్కాన్నీ, తన ఆయుధమైన వడిసెలనూ ముసలమ్మకట్ట మధ్యన వున్న చెట్టుకు తగిలించి వున్నాడు. అది జువ్విచెట్టూ, వేపచెట్టూ పెనవేసుకుని దట్టంగా పెరిగిన ఏకవృక్షం! ఆ చెట్టు ముసలమ్మ మరణం తరువాత ఆమె జ్ఞాపకార్థంగా నాటినదే! ముసలమ్మ కథను ప్రజలు ఇంకా చెప్పుకుంటూనే వున్నారు.

ఒకప్పుడు బుక్కరాయసముద్రం చెరువు ఉత్కృష్టంగా నిండి పొంగి పొరల డానికి సిద్ధంగా వుంది. రెండు మరవలూ పట్టకుండా ఉదకం పారుతూ వుంది. బుక్క రాయ సముద్రం పురజనులూ, ఆయగాండ్లూ అంతా చూసేదానికి వచ్చినారు. ఆ జనంలో ఒక స్త్రీకి శివమెత్తింది. నేను గంగాభవానిరా! నాకు ఆహారంగా నరబలి ఇస్తే నిలుస్తా వున్నాను. లేకపోతే నిలవవలసినది లేదు అని చెప్పింది. నరబలికి ఏలాగున చేతాము అని గ్రామస్తులు ఆలోచన చేయగా; బసిరెడ్డి ఏడవ కోడలు ముసలమ్మ అనే చిన్నది ముందుకు వచ్చింది. ఇంకా ఈడేరని రెడ్డి కోడలు ముసలమ్మ!

పసుపూ కుంకుమ పెట్టుకుంది
ఉతికిన చీర కట్టుకుంది.
నిమ్మపండు పట్టుకుని కట్టమీదికొచ్చింది.
మామకు నమస్కారం చేసింది.
పురజనులకు నమస్కారం చేసింది.
రాయబారం తూము పక్క నెర్రిలోకి దిగింది.
కట్టకు పడిన గుమ్మడిలోకి ప్రవేశించింది.
అప్పుడు జనాలు మన్నూ రాయి వేస్తే కట్ట నిలిచింది.
ఆరకంగా రెడ్ల ఆడపడుచు ముసలమ్మ చరిత్రలో నిలిచిపోయింది.

బిల్లే ఎల్లప్ప, "ఓరు?.. ఓరాడ?" అన్నాడు. తన కుక్కల అరుపులకు ప్రతి స్పందనగా! దొంగలు వచ్చివుండవచ్చు. రాకనూ వుండవచ్చు. కానీ కుక్కలు భౌమని మొరిగినప్పుడల్లా ఎవరక్కడ అని గదమాయించడం గొర్రెలవాళ్లకు ఆనవాయితీ. మందకు మరోవైపు నుంచి, "ఓరాడ??" అంటూ ఇంకొక గొంతు వినిపించింది. ఆ గొంతు, బిల్లే ఎల్లప్పతో గొర్రెలు కలేసుకున్న అతని తోటి మనిషిదే!

"ఏదో శబ్దం వినిపిస్తూందన్నా! కుక్కలు కూడా మొరుగుతుండాయి," అన్నాడు బిల్లే ఎల్లప్ప.

"ఈడకాదులే పాపోడా! యాడనో దూరంగా చెరువుకట్ట మీద."

"చూసివస్తునా అన్నా?"

"ఊరుకో పాపోడా! వారు మన జోలికి రానప్పుడు వారితో మనకేం పని!"

కుక్కలు మొరుగుతూనే వున్నాయి. బిల్లే ఎల్లప్ప అసహనంగా కదిలినాడు. అవి ఏమి శబ్దాలు? ఏం జరుగుతూ వుంటుంది అక్కడ? ఉత్సుకత అతన్ని ముందుకు తోస్తూ వుంది.

"ఏం జరుగుతూ వుందో చూసివస్తానన్నా!"

"పాపోడా! నువ్వు ఒక్కనివి. వారు ఎంతమంది వున్నారో నీకు తెలీదు! పైగా నీది ఉడుకు రక్తం. ముందూ వెనకా తెలీదు," అన్నాడు ఆ నడివయసు మనిషి.

తూములు ఎత్తడమూ, మూసివేయడమూ, కాలువలకు నీళ్లతిప్పడమూ, మడికయ్యలకు మల్లేయడమూ నీరుకట్టు వారిపని. సంస్థానం వారు చెరువుకట్ట భద్రత కూడా వారికే ఒప్పగించి వున్నారు. వారు కట్టమీద ఇప్పటికి రెండు మూడుసార్లు కూతలు వేయవలసి వుంది. కానీ వేయలేదు. ఏమైపోయినారు వారు? పైగా రాళ్లను తవ్వుతున్నట్టు ఆ శబ్దాలేమిటి?

బిల్లే ఎల్లప్ప, చెట్టుకొమ్మకు తగిలించిన వడిసెల తీసుకుని కట్టవైపు పరుగెత్తి నాడు.

"చీకటి పాపోడా!చూసుకుని పో!" గుసగుసగా అరిచినాడు తోటికాపరి.

ఆగంతకుల దగ్గరికి పరుగెత్తుతున్నవాడల్లా ఏదో గుర్తొచ్చి చటుక్కున ఆగినాడు బిల్లే ఎల్లప్ప! అతనిలో మెరుపువంటి ఆలోచన.

ఆగంతకులకు దగ్గరగా చెరువుకట్ట ఎక్కితే ప్రమాదం. కట్ట మీద వున్న వాళ్లు కట్ట కిందవున్న తనమీదికి బండరాళ్లు దొర్లించేది సులభం. రాయబారం తూముకు కొంచెము ఎడముగా కట్ట పైకి పాకినాడు.గొర్లకుక్కలు వెంబడించినాయి. దుండగుల నుంఎతీ చెరువు తెగగొట్టే శబ్దాలు ఆగిపోయినాయి. కుక్కల అరుపులు దగ్గర కావడముతో వారు అప్రమత్తమయినట్లు వున్నారు. తనమీద దాడికి సిద్ధమవు తున్నట్లు పసిగట్టినాడు బిల్లే ఎల్లప్ప. చీకట్లో తారాడి తారాడి లావు లావు రాళ్లను ఏరుకుని చల్లాడం జేబులో పోసుకున్నాడు.

"ఓరు ఆడ? ఏం చేస్తుండారు?"

"నువ్వెవరు? వచ్చిన దావలో పో!"

తాను ఒక్కడే! ఇప్పుడు తన బలగమంతా కుక్కలే! కానీ కుక్కలు తనను విడిచి పదిబారల కంటే ఎక్కువగా ముందుకుపోవు. అవి వారిమింద పడవలెనంటే తాను ఇంకొక పదిబారలు ముందుకు జరగవలె. వారు ముందుకువచ్చే ప్రయత్నం చేయకుండా తనకోసమే కాచుకున్నట్లున్నారు. మెల్లగా పదిబారలు అడుగులు ముందుకు వేసినాడు. వడిసెలలో రాయి పెట్టుకుని సిద్ధమై కుక్కల్ని ఇస్కో అని గమ్మించగానే అవి భౌమంటూ ముందుకు దూకినాయి. బిల్లే ఎల్లప్ప వెనుకే ఆగి పోయి, ఇస్కో ఇస్కో!... అని వాటిని గమ్మిస్తూనే వున్నాడు. అవి రెండు కాళ్లమీద ఎగిరి ఎగిరి దొరికినవాడిని దొరికినట్లు చీల్చిపారేసినాయి. కండల్ని బైటికి ఊడబెరికి నాయి. బిల్లే ఎల్లప్పను దగ్గరికి రానిచ్చి దాడి చేయాలనుకున్న దుండగులు కుక్కల ముందస్తు దాడిని ఊహించలేకపోయినారు. వారికి కంపం చుట్టుకుంది. పారిపో జూసినారు. ఇద్దరు కుక్కల్ని వదిలించుకుంటూ, కిందపడి పొరలాడుతున్నారు. ఆ ఇద్దరి కతనూ కుక్కలు చూసుకుంటాయి. ఇంక మిగిలిన ఇద్దరితోనే తన కొట్లాట! అప్పుడు పరుగెత్తినాడు ముందుకు బిల్లే ఎల్లప్ప. వడిసెలను గిరగిరా తిప్పి వదిలినాడు. ఆ చీకట్లో ఒకనికి గుడ్డి వేటులో నడ్డి వేటు మాదిరి తగిలింది రాయి. తుపాకిగుండు మాదిరి తగిలిన ఆ రాయి దెబ్బకు తల పట్టుకుని పడిపోయినాడు వాడు. ఇంకొకడు కట్ట మీద నుంచి కిందికి జారి పారిపోతుండగా బిల్లే ఎల్లప్ప వెంటపడబోయి మాను కున్నాడు. కిందపడి తన్నుకుంటున్న ఒకన్ని దొమ్మలమీద గుద్దినాడు. మరొకడిని కాలి కింద వేసుకుని తొక్కినాడు. కుక్కల్ని పక్కకు అదిలించి, ఒకని తలను ఒక చంకలోనూ, ఇంకొకని తలను ఇంకొక చంకలోనూ అదిమిపట్టి ముందుకు నడిచినాడు. ఒడలంతా నూనె రాసుకున్న వారి మెడలు జారిజారిపోతుంటే వారి మెడలకు ఎర్రమన్ను రాసినాడు. దుండగుల మీదికి ఎగబడుతున్న కుక్కలను అదిలిస్తూ కట్ట దిగినాడు. ఊరికుక్కలు భౌమంటూ ఎదురుకాగానే, తన కుక్కల్ని వెనక్కి పొమ్మని అదిలించి గంగమ్మ గుడి వద్దకు వచ్చినాడు.

"ఓ తలారప్పో! ఓ తలారప్పో!"

యాది హెచ్చరికలు చేస్తూ కావలి కాస్తున్న ఇద్దరు తలారులు పరుగెత్తుకు వచ్చినారు. వారి చేతుల్లో కోలదివిటీలు వెలుగుతున్నాయి. చెరువుకట్ట తెగగొట్టేదానికి వచ్చినారని చెప్పగానే ఒక తలారి మందికోసము కోటవైపు పరుగెత్తినాడు. ఇంకొక తలారి ఇద్దరు దుండగులనూ రచ్చకొట్టములో బంధించి మెడకూ, చేతికీ బొండ కొయ్యలు తగిలించినాడు.

సన్నదు దయచేస్తే వెళ్లిపోతానన్నాడు బిల్లే ఎల్లప్ప. తలారి ఒప్పుకోలేదు. నిన్ను మా కావల్‌గార్ దగ్గర హాజరుపరచవలసి వుంది అని పిలుచుకు పోయినాడు. కానీ

అప్పటికే కావల్‌గార్ ఇరవైమంది జెట్టీలతోపాటు చెరువుకట్ట పైకి పోయి వున్నాడు. తలారి బిల్లే ఎల్లప్పను దళవాయి ఇంటికి పిలుచుకుపోయినాడు. అప్పటికే వార్త తెలిసిన దళవాయి సుబ్బరాయుడు తన భవంతి పడసాలలో పచార్లు చేస్తున్నాడు. అతనికి ముప్పై అయిదేండ్లు వుంటాయి. వర్తమానాన్ని ఈ రాత్రికి రాత్రే దొరవారికి చేరవేయడమా? లేక చెరువు నుంచి కావల్‌గార్ వచ్చే వరకూ ఆగడమా? అనే సందిగ్ధంలో వున్నాడతడు. కోటలో కాలపు గంటలు మోగినాయి. బ్రాహ్మీ ముహూర్తానికి ఇంక రెండు ఘడియల కాలమే వుంది. అప్పటికి దొర ఎట్లాగూ నిద్ర లేస్తాడు. ఇంతలో ఏం తొందర? అతనికి ఇంకొకటి కూడా గుర్తుకు వచ్చింది. దొర ఇప్పుడు అంతఃపురంలో కూడా వుండడు. పద్మసాని మందిరంలో వుంటాడు.

తలారి చెప్పగా విని, దళవాయి సుబ్బరాయుడు బిల్లే ఎల్లప్పను ఎగాదిగా చూసినాడు. అతనిలో సంభ్రమం. చేతిలో కత్తీకటార్లూ లేవు. రెండు కుక్కలూ, ఒక వడిసెల. నలుగురు మనుషులతో ఢీ అంటే ఢీ అన్నాడు. మొనగాడంటే వీడు! సంస్థానానికి పనికొస్తాడని అనుకున్నాడు.

బిల్లే ఎల్లప్ప, "దేవరా! మందలో మా మనిషి ఒక్కడే వున్నాడు. ఒక్కడే అన్ని గొర్రెలను చూపెట్టుకోలేడు. దయచేసి సన్నదు ఇప్పించండి. పోయి వస్తాను," అన్నాడు. తన వీరత్వాన్ని అతిశయంగా చెప్పుకోవడానికి ఏమాత్రం ప్రయత్నించని ఆ కురువ వీరున్ని చూస్తే, దళవాయికి ముచ్చట వేసింది.

"నిన్ను హండే దొరగారి దగ్గరకు తీసుకుపోవలసి వుంది. అంతవరకూ మా తలారితోనే వుండు. నీ గొర్రెలకు ఏం భయంలేదు. మా మనుషుల్ని కాపుదల పంపించే ఏర్పాటుచేస్తాం."

✦ ✦ ✦

పచ్చల చిల్కల మంచంకోళ్లు గల సకినెల పట్టెమంచము మీద హండే దొర సిద్ధరామప్ప నాయుడు నిద్రపోతున్నాడు. అతని పక్కనే జక్కుల పద్మసాని నిద్రపోతూ వుంది. జక్కుల అనేది కళావంతులలో ఒక గోత్రం. పూలపాన్పు, కుంకుమ తలగడ, కంచు దీపపు కంబము, నిలువుటద్దాలతో ఆ శయనమందిరం ఆకర్షణీయంగా వుంది.

జక్కుల పద్మసాని వంశానికి దాదాపు నూటాయాభై సంవత్సరాల చరిత్ర వుంది. ఆమె పూర్వులది మొదట పెనుగొండ సంస్థానం. క్రీ.శ. 1594-95లో గోల్కొండ సైన్యాలు పెనుగొండపై దాడి చేసినప్పుడు, తంజావూరు రాజకుమారుడు రఘునాథుడు పెనుగొండకు వచ్చి గోల్కొండ సైన్యాన్ని తరిమివేసినాడు. అప్పుడు రఘునాథుని పరివారంలో ఒక రాచబంధువు వున్నాడు. ఆ రాచబంధువును ఆశ్రయించిన కళావంతుల కుటుంబం ఒకటి అతనితోపాటు తంజావూరు తరలిపోయింది. అప్పటి ఆ కళావంతుల వారసురాలే ఈ జక్కుల పద్మసాని.

క్రీ.శ. 1673లో మధుర రాజు చొక్కనాథుడు తంజావూరిపై దాడిచేసి ఓడించి నప్పుడు పద్మసాని పూర్వీకులు మధురకు పోయి స్థిరపడినారు. మళ్లీ ఆ మధుర రాజ్యాన్ని ఆర్కాటు నవాబు చందా సాహెబ్ ఆక్రమించినపుడు పద్మసాని కుటుంబం తిరిగి తమ మూలస్థానమైన పెనుగొండకే మరలి వచ్చింది. ఆ విధంగా ఆమెది నాయక రాజుల కళాసంప్రదాయం! దేవదాసి సంప్రదాయం! రాజులూ, ధనవంతులూ దేవదాసీ లను కొని గుడులకు దానం చేస్తారు. ఆ గుడులలో పాటలు పాడి, నృత్యాలు చేసి వీరు ప్రజలను అలరిస్తారు. ప్రజలు దేవదాసీలకు లంజకట్నం పన్నుగా సమర్పించు కుంటారు.

తంజావూరి సంగీత సాహిత్య నృత్య వారసత్వం పద్మసానిని ఇప్పటికీ అంటి పెట్టుకుని వుంది. ఆమె కళాసంస్కారమే హండేరాజు సిద్ధరామప్పనాయుడిని ఆకర్షిం చింది. తన రాచనగరుకు సమీపంలోనే అతడు పద్మసానికి భవంతి కట్టించినాడు. ఆ భవంతిలోని పడకగది నిండా తంజావూరి వస్తు సముదాయమూ, పద్ధతులనే ఏర్పాటు చేసుకుంది ఆమె. ఆ భవంతిలో నిలువెత్తు అద్దాల తలుపులు, అద్దాల చావిడులు! లోపలి గోడల మీద రంగులలో చిత్రించిన స్త్రీల నృత్యభంగిమలు. దక్షిణాది దంతపు బొమ్మలు, సిందివాడ ఎర్రచందనం బొమ్మలు, ఉత్తరాది ఇత్తడి బొమ్మలు, చీనా లక్కబొమ్మలు... అట్ల సేకరించినవి చాలానే అమర్చబడినాయి. ఇల్లు, దుస్తులు, నగలు, అత్తరు, పువ్వు, తాంబూలం, పక్కతోపాటు స్త్రీ సహితంగా అష్టభోగాలు ఏర్పాటుచేసిన భవంతి అది.

హండే వంశంవారు శివపూజ చేయక గంగాపానం చేయరు. మధురాహార ములే గాని మధు, మాంసభక్షణ చేయరు. కానీ వారి నియమాలు క్రమక్రమంగా సడలిపోయినాయి. మెల్లమెల్లగా మానినీమద్యాల వైపు మొగ్గు చూపినారు. ఇప్పుడు పద్మసాని మందిరంలో హండే రాజు కోసం ఏర్పాటుచేసిన మద్యవిశేషాలు చాలానే వున్నాయి. మాధవము, ఐక్షవ, గౌడీ, ఆసవ, కాదంబ మొదలైన మద్యాలు సిద్ధంగా వున్నాయి.

పద్మసాని వస్త్రభాండాగారంలో నీరుకావి, చెంగావి, బెండిరకావి వంటి రంగు వస్త్రాలూ, కంచి పట్టుచీరలూ, నెమళ్ల అంచులతో వున్న బంగారు జరీచీరలూ వున్నాయి. తంజావూరు రాజుల అంతఃపురంలో వుండే ఆడువారి వాద్యబృందానికి అనుసరింపుగా వీణ, కిన్నెరలు పలికించే ఇద్దరు స్త్రీలను ఏర్పాటుచేసింది పద్మసాని. కొరవంజిని ఆడిపాడే నాట్యకత్తె కూడా వుంది. ఒక్కమాటలో చెప్పవలెనంటే, తంజా వూరు రాజగోపాల విలాసానికి పద్మసాని భవంతి చిన్న నమూనాగా వుంది.

హండే సిద్ధరామప్పనాయుడు మేలుకున్నాడు. అతని నుదురు విశాలం. కళ్లు చిన్నవి. పల్చటి చెంపలు, బవిరి గడ్డం. పొడవైన సన్నటి మీసాలు రెండు వైపులా కిందికి జారి వుంటాయి. అతడు నిద్రపోతున్న పద్మసాని వంక తదేకంగా చూస్తున్నాడు.

ఆమె జవ్వాది పూసుకుని జారుకొప్పు కట్టుకుంది. గుమ్మడిగింజ నామం తీర్చింది. సన్నటి నడుమూ, బలమైన పిరుదులతో పోతపోసిన విగ్రహం మాదిరి వుంది పద్మసాని. ఆమె బొందిలీలు వేసుకునే బంగారు రవికె తొడిగింది. పసిడికమ్మి చీర కట్టింది. మణులు పొదిగిన పాపిటిబిళ్ల పెట్టుకుంది. బొడ్డుదాకా సాగిన నాభిహారం వేసుకుంది. ఆమె చెవికమ్మలు దళాలున్న పువ్వుల ఆకారంలో వున్నాయి. ఎడమ ముక్కుపుటం మీద బంగారు నాసికాభరణం వుంది. మణికట్టుకు కంకణాలు వున్నాయి. వేళ్లకు వుంగరాలు, నడుముకు మణుల వడ్డాణమూ వున్నాయి. కాళ్లకు విలువైన రాళ్లు పొదిగిన వెండి గొలుసులు వున్నాయి. ఇన్ని ఆభరణాలను రాత్రిపూట ధరించడానికి ఒక కారణముంది. అది ఆమెకు ముఖ్యమైన దినం. హండే రాజు మొట్టమొదట ఆమెను చేరదీసిన రోజు అదే!

అప్పుడు పద్మసానికి పదహారేండ్ల ఎలప్రాయం. పెనుగొండలో తల్లిచాటు పిల్లగానే వుండేది. అప్పుడు ఆమెను బయన్నగారి అనంతయ్య అనే వర్తకశ్రేష్ఠుడు కొని బుక్కరాయ సముద్రం లక్ష్మీనారాయణస్వామి గుడికి దానమిచ్చినాడు. ఆవిధంగా పద్మసాని కులవృత్తి దేవదాసిగానే మొదలయింది.

ఆ దినం లక్ష్మీపండగ రోజు!

ఆలయంలో లక్ష్మీనారాయణస్వామిని అలంకరించినారు.

భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు.

అందంగా అలంకరించుకున్న గుడిసానులు రంగభోగాలలో పాటలు పాడుతున్నారు. గుడి మంటపంలో కొత్త దేవదాసి నర్తిస్తూ వుంది. తమ జక్కులవారికి ప్రియమయిన కామేశ్వరీ కథ చెబుతూ నర్తిస్తూ వుంది. నాట్యము మూడుపాళ్లు, నృత్తము ఒక పాలు ప్రదర్శితమవుతున్న పద్మసాని నాట్యం హండే రాజును సమ్మోహనపరిచింది. దొర కోటకు వచ్చి ఆ దినమే ఆమెకు నగలు, చీరలు కానుకలుగా పంపినాడు. ఆ లక్ష్మీపండగ రోజు రాత్రికే ఆమెను స్వంతం చేసుకున్నాడు.

క్రితం రాత్రి లక్ష్మీపండగ రోజు ఆమె ధరించిన ఆభరణాలలో ఆ మొదటిరోజు రాజు పంపినవి కూడా వున్నాయి.

ఇప్పుడు పద్మసాని ముప్పై సంవత్సరాలు దాటిన ప్రౌఢ. ఆమెకిప్పుడు పదమూడు సంవత్సరాల వయసు గల కొడుకు వున్నాడు. పేరు మన్నారుదాసు. ఆ దేవదాసి కుటుంబంలో పుట్టిన మొదటి మగబిడ్డకు ఆ పేరు పెట్టడం ఆ వంశానికి ఆనవాయితీగా వస్తూ వుంది. పద్మసానికి పెంపుడు కూతురు కూడా వుంది. పేరు నాగసాని. పద్మసానికి మగబిడ్డ పుట్టడం ప్రత్యేకమయిన సంతోషం కలిగించలేదు. దేవదాసి వృత్తి స్త్రీ కేంద్రంగా జరిగేది. దేవదాసి కుటుంబాల ఆర్థిక వైభవమంతా స్త్రీ సౌందర్యం అనే వనరు మీదే ఆధారపడి వుంటుంది. అందుకే, పద్మసాని కొడుకు పుట్టిన తరువాత ఆడపాపను కొనుక్కుంది. అదీ ఒకానొక కరువు కాలంలో. పాలులేక

బక్కచిక్కి గుక్కపట్టి ఏడ్చే పసిపాపలో కనుముక్కు తీరూ, ఒంటిరంగూ, చేతివేళ్లూ పరిశీలించి, ఆ పాప భవిష్యత్తులో ఎటువంటి సౌందర్య వికాసం పొందగలదో అంచనా వేసింది పద్మసాని.

✦ ✦ ✦

బయన్నగారి అనంతయ్యశ్రేష్టి ప్రస్తుతం డెబ్బయి సంవత్సరాలు పైబడిన వృద్ధుడు. ప్రస్తుతం పెనుగొండ నివాసి. వాస్తవానికి అతనిది అనంతపురమే! అతడు అనంతపురం వదలి, పెనుగొండ చేరడానికి కారణముంది. అప్పటికి ముప్పై అయిదు సంవత్సరాల క్రితం మూడో పవాడప్ప కొడుకు అయిన మూడో సిద్దప్ప అనంతపురం సంస్థానాన్ని పాలించేవాడు. ఈ సిద్దప్పనాయుడు హండే వంశంలో చెడబుట్టినవాడు. కుటుంబ సంప్రదాయాలను గాలికి వదిలేసినవాడు. పచ్చి తాగుబోతు, కామోద్రేకి. అతని రాసలీలల్ని కథలు కథలుగా చెప్పుకుంటారు రాజోద్యోగులు.

అతని విలాసమందిరంలో వేశ్యలు చాలామంది వుండేవారు. అందరినీ ఒకేసారి అనుభవించాలనే తుత్తర సిద్దప్పనాయుడిది. నములుతున్న తాంబూలాన్ని ఒక పడుచుపిల్ల నోటికి అందిస్తాడు. ఒక నాగవేణి జడను పరమ మోటుగా లాగుతాడు. పాదాల చెంత కూర్చున్న పడతి కోకముడిని కాలివ్రేళ్లతో సడలిస్తాడు. ఒక కలికి వక్షోజాలపై కస్తూరి పులుముతాడు. ఒక మదవతి రొమ్మును పట్టుకుంటాడు. ఒక స్త్రీని ముద్దులాడతాడు. ఒక జాణను పేట్రేగి కౌగిలిస్తాడు. ఒక వినోదినిని తొడపై కూర్చోబెట్టుకుంటాడు. ఇంతమంది వేశ్యలు చాలరన్నట్లు సంసార స్త్రీల మీద పడటం కూడా మొదలుపెట్టినాడు.

అప్పుడు దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. దేవాలయాలలో భరత, కూచిపూడి నాట్యాలు, వీధులలో పురుషుల కోలాటాలు, స్త్రీల బొడ్డెమ్మ ఆటలు జరుగుతున్నాయి. జంగం, బుర్రకథలూ, బయలు నాటకాలూ, తోలుబొమ్మల ఆటలతో ఊరు ఊరంతా కోలాహలంగా వుంది. ఆ ఉత్సవాల సందడిలో సిద్ధప్ప నాయుని చూపు ఒక కోమటి కన్య మీద పడింది. ఆ కన్య బయన్నగారి అనంతయ్య శ్రేష్టి కూతురు! అందరు ఆడపిల్లలనూ చెరపట్టి తెప్పించుకున్నట్టు, ఆ కోమటి కన్యను తెప్పించుకోవడం శ్రేయస్కరం కాదనుకున్నాడు సిద్దప్పనాయుడు. అనంతయ్య శ్రేష్టి చిన్నాచితకా వర్తకుడు కాడు. వర్తక శ్రేణులలో పేరుమోసినవాడు. అటువంటి పలుకుబడి కలిగిన వ్యక్తి కూతురిని చెరబడితే రాజోద్యోగులకు ఆగ్రహం కలగవచ్చు అని ఆలోచించి సమయం కోసం పొంచి చూస్తున్నాడు.

సిద్దప్పనాయుని పట్టపు భార్య పేరు భద్రమ్మ. కోటలో జరిపే బొమ్మల కొలువుకు రమ్మని ఆమె నుంచి అనంతయ్యశ్రేష్టి కుటుంబపు ఆడువారికి కబురందింది. తన కుటుంబ స్త్రీలను కోటలోకి పంపడం గురించి అనంతయ్య శ్రేష్టి మొదట సంకోచించినాడు. పంపితే ఏమవుతుందో, పంపకపోతే దొరసాని ఏమనుకుంటుందో!

కానీ, దొరసాని నుంచి వచ్చిన పిలుపు కదా అని అనంతయ్యశ్రేష్టి నమ్మకంతో పంపించి నాడు. ఆ వర్తమానం సిద్దప్పనాయుడికి చేరవేసినారు అతని బంటులు.

అది దసరా నవరాత్రులలో మూడవదినం. కోటలోని పేరంటానికి పెద్ద కుటుంబాల స్త్రీలూ, బాలికలూ వచ్చినారు. పట్టుచీరల రెపరెపలూ, బంగారు, ముత్యాల ఆభరణాలతో ధగధగా మెరిసిపోతున్నారు. బొమ్మల కొలువులోని ఒక్కొక్క బొమ్మ గురించి అబ్బురంగా చర్చించుకుంటున్నారు. ధరణికోట పాలరాతి విగ్రహాలు, రతనాటిసీమ కర్రబొమ్మలు, గంగవాడి మంచి గంధపుచెక్క బొమ్మలు, కళింగం కొమ్ము బొమ్మలు కొలువుతీరి వున్నాయి. బొమ్మలలో శివలీలలు వంటి కథలు వున్నాయి. నర్తకీమేళమూ, రాజసభ వంటి ఘట్టాలు వున్నాయి. స్త్రీలు పేరంటం పాటలు పాడినారు. వాయనాలు పుచ్చుకున్నారు. కోట మోసాలపైన కాలపు గంటలు మోగినాయి. దొరసాని భద్రమ్మ దగ్గర శలవు తీసుకుని ఒక్కొక్కరూ ఇండ్లకు మళ్లుతున్నారు. అట్లా ఇండ్లకు మళ్లిన స్త్రీల నుంచి ముగ్గురు కోటలోనే తప్పిపోయి నారు. వారిలో ఇద్దరు, పెండ్లి చేసుకుని సంసారాలు చేసుకుంటున్నవారు. మరొకరు, పెండ్లి కాని పడుచు! అనంతయ్యశ్రేష్టి కూతురు!

అనంతయ్యశ్రేష్టి తన కూతురి విషయాన్ని బయటికి పొక్కనీయలేదు. నెల గడిచింది. చిక్కి శల్యమైన కూతురు ఇంటికి రాలేదు. ఇంటికి చేర్చబడింది. అదీ చాలా గుట్టుగా! కానీ గుట్టు రట్టు కాకుండా కాపాడుకోవడం అనంతయ్యశ్రేష్టికి అంత కంతకూ కష్టమయింది. ఆ కోమటి పడుచుకు పిచ్చెక్కింది. ముఖం బరుక్కుంటుంది. జుట్టు పీక్కుంటుంది

'వద్దు వద్దు... రావద్దు!... ఏమీచేయవద్దు, విప్పుతాను విప్పుతాను!!' అని, బట్టలు ఊడబెరుక్కుంటుంది.

గది లోపల బంధిస్తే తలుపులు బాదుతుంది. నోరు కొట్టుకుంటుంది. నెత్తురు కారేటట్లు తలను గోడకు కొట్టుకుంటుంది. అన్నం మూడుముద్దలు తిని పళ్లెం విసిరేస్తుంది.

ఒక దినం శ్రేష్టికి రాకూడని ఆలోచన వచ్చింది. అందుకు ఆరోజు జరిగిన ఘటనే కారణం. ఆరోజు అతని కూతురు గుడ్డలు చింపుకుని ఉత్తబిత్తల పరుగెత్తింది. ఆ కోమటి వీధివీధంతా దిశమొలతో పరుగెత్తే తన కూతుర్ని చూడటం శ్రేష్టికి తల తీసేసినట్లు అయింది. ఆ దినమే ఖండితం చేసుకున్నాడు. ఆ ప్రకారం సంసారాన్ని పెనుగొండకు తరలించినాడు. అట్ల పెనుగొండకు చేరిన ఆ గూడుబండిలో కోమటి పడుచు మాత్రం లేదు.

పెనుగొండకుపోయే తోవలో రాప్తాడు దాటిన తరువాత కోన అనే అడవి వస్తుంది. ఆ అడవిలో ఒక చెట్టు కింద నిద్రలో వున్న తన కూతుర్ని పడుకోబెట్టి వచ్చేసినాడు శ్రేష్టి! అతనికి ఇప్పటికీ గుర్తు, అట్లా వదిలేసి వస్తూ వస్తూ వెనక్కి చూస్తే

నిద్రపోతున్నకూతురి ముఖంలోని అమాయకత్వం! సంవత్సరాలు గడుస్తున్నా ఆ ముఖం అతన్ని వెంటాడుతూనే వుంది. ఆ ముఖంలోని నిర్మలత్వం కళ్లల్లో కదలాడి నప్పుడల్లా ఇప్పటికీ ఆ వృద్ధుని కళ్లు తడి అవుతూనే వుంటాయి.

✦ ✦ ✦

అప్పటికి పద్మసాని నిద్రలేచి లోనికి వెళ్లిపోయింది. రక్కసి తంగడి యుద్ధానికి ముందు విజయనగర రాజుల దినచర్యలను స్థానాపతులు అక్షరబద్ధం చేసేవారు. ఆ విషయాలను తమ తమ దుర్గాధీశులకు చేరవేసేవారు. ఆ సామంత ప్రభువులు తమ విజయ నగరాధీశుని దినచర్యలను అనుసరించే ప్రయత్నం చేసేవారు. ఆ విధంగా వారు తమ ప్రభుభక్తిని ప్రదర్శించేవారు. విజయనగర రాజుల హయాం అంతరించినా, హండే రాజుల దినచర్యలలో ఆ సంప్రదాయాలే ఇప్పటికీ కొనసాగు తున్నాయి.

బ్రాహ్మీ ముహూర్తాన నిద్ర లేచిన రాజు లేచీ లేవగానే చేయవలసిన పని, అద్దంలో తన ముఖదర్శనం చేసుకోవడం! పద్మసానికి వెండి పిడి కలిగిన చేతి అద్దం వుంది. ఆ అద్దంలోనే రాజు ముఖదర్శనం చేసుకునేవాడు. ప్రస్తుతం పట్టెమంచానికి తలపాటున నిలువెత్తుటద్దం బిగింపచేసినాడు. ఆ అద్దం వారికి శృంగారోద్దీపనము కలిగించేది కూడా. పద్మసాని ఎదురొత్తులూ, ఉపరతి భంగిమలూ ఆ అద్దానికి తెలియ నివి కావు.

రాజు పొడవుగా పెరిగిన జులపాలు సవరించుకున్నాడు. తల మీద కుల్లా పెట్టుకుని రాచనగరు చేరినాడు. దంతధావనం గావించినాడు. స్నానగృహం గోడల నిండా అందమైన చిత్రాలు. అతడు దినము మార్చి దినము అభ్యంగన స్నానం చేయ వలె. ద్వితీయ దశమి, ఏకాదశ దినాలు వర్జ్యాలు, గేదంగి, జాజికాయ, పున్నాగంతో కాచిన తిలతైలాన్ని అతని శిరస్సుకు మర్దించినారు దాసీలు. నిమ్మ, తులసి, ఏలక, జాజితిలలు, కొత్తిమిరి, లవంగం, శ్రీగంధంతో నలుగు సిద్ధం చేసినారు. వెండి బిందెల లోని పన్నీటి జలంతో స్నానం చేయించినారు. రాజు విభూతి ధరించి కన్యలను, కపిల గోవును, బ్రాహ్మణుని దర్శించుకున్నాడు. ఆరాధ్యుల నామావళులు వినినాడు. తన కులదైవమైన సొన్నలాపురం సిద్ధరామేశ్వరుని నుంచి వచ్చిన విభూది, గంధ ప్రసాదా లను ప్రత్యేకంగా స్వీకరించినాడు ఆరోజు.

అతని వస్త్రభాండారంలో సింహళం, నాగపట్టణం, దేశాలలో సిద్ధమైన వస్త్రాలు వున్నాయి. సింధూర, హరిత, నీలిరంగుల్లోని సెల్లాలు, దుప్పట్లు, బొందెల అంగీలు, టోపీలు వున్నాయి. అతడు వసంతంలో నూలుబట్టలు ధరిస్తాడు. అది వర్షాకాలం కనుక, ఆరోజు ఎర్రని అంచుగల తెల్లని ఉన్ని వస్త్రాలు ధరించినాడు. నడుమున కాసెకట్టి, అంత నిడువు కాని చిన్న అంగీ తొడిగినాడు. పట్టు జరీ కుచ్చుకులాయి

ధరించినాడు. భుజంపై దుప్పటి అంత పెద్ద సెల్లా వేసుకున్నాడు. చెవులకు ముత్యాల పోగులు, కంఠమందు హురుముంజి, ముత్యాలదండ ధరించి సభకు బయలుదేరి నాడు.

దళవాయి సుబ్బరాయుడు కోట ముందు గుర్రపురాళ్లు దాటి హజారములోకి ప్రవేశించి రాత్రి రాజముద్రతో సీలువేసి మూసిన కోట తలుపులు తెరిపించినాడు. అప్పటికి చిన్నతలారి, బిల్లే ఎల్లప్ప అక్కడికి వచ్చి కాచుకుని వున్నారు. వారి వెంట, రాత్రి రచ్చకొట్టంలో బంధించి వున్న ఇద్దరు దుండగులు కూడా వున్నారు. వారి ఊరూ పేర్లని కాగితాల మీద నమోదు చేయించినాడు చిన్నతలారి. అందరూ కోటలోకి ప్రవేశించినారు. బంగారు పిడిగల కత్తితో, పంచ మహావాయిద్యాల మధ్య వచ్చినాడు హండే ప్రభువు. గండరగండ, గండభేరుండ, విప్రజనాశ్రయ చతుర్థకుల కుముదినీ రాజ్యవర్ధనచంద్ర, హండేగోత్ర, అనంతపురాధీశ్వర అనే రాజస్తుతుల మధ్య ఆశీనుడు అయినాడు.

బొండుకొయ్యలు తగిలించిన నలుగురు బందీలను న్యాయస్థానంలో ప్రవేశ పెట్టినారు. వారిలో ఇద్దరు దుండగులు! మరోఇద్దరు నీరుగట్టువారు! నీలి చల్లాడాలతో వున్న ఇద్దరు దుండగులూ వణికిపోతూ చమటలు కక్కుతున్నారు.

దళవాయి చెప్పుకొచ్చినాడు- "చెరువు సురక్షితంగా వుంది ప్రభూ! ఈ గొర్లవాడు అర ఘడియ ఆలస్యం చేసి వుంటే చెరువు తెగిపోయి వుండేది. మహా ఉపద్రవం వచ్చి వుండేది. ఒక వడిసెల, రెండు కుక్కలతో ఒక్కడే పోరాడి, మన గ్రామాన్ని కాపాడిన వీరుడు. మీ కరుణాకటాక్షాలకు అర్హుడు."

దొర ప్రసన్నంగా చూసినాడు బిల్లే ఎల్లప్ప వైపు. బిల్లే ఎల్లప్ప సాగిలబడి మొక్కి, లేచి చేతులు కట్టుకున్నాడు. దళవాయి సుబ్బరాయుడు దుండగుల గురించి చెప్పు కొచ్చినాడు- "వీరు మన సంస్థానంలోని వారు కాదు ప్రభూ! తాడిమర్రి సంస్థానంవారు. ఆ సంస్థానంలోని జెట్టీలు. వారి దొర ఆజ్ఞ మేరకే మన చెరువును తెగగొట్టే దుస్సాహ సానికి పూనుకున్నారు. వీరు దండనకు పాత్రులు."

ఇద్దరు దుండగులలో ఒకడు గొంతు పెగల్చుకున్నాడు-

"అయ్యా! మేము ఆయుధ హస్తులము. ఎవరు కొలువు నిల్పినా జాగ్రత్తగా వుండి వారి పని నెరవేర్చేవారమే కానీ ఇతరం లేదు. మమ్ము పిలిపించిన ధణీలు ఇప్పటికి పరారు అయివుంటారు. మాతో ఏమి తీరవలసినది? కనికరించండి మహారాజా!"

హండేరాజు దళవాయి వైపు చూసినాడు.

దళవాయి, "వీండ్లు మన సంస్థానం కాదు కాబట్టి, రాజద్రోహులుకారు. వీండ్లు మనుష్యమాత్రులు. వీండ్ల దొరతో తప్ప వీండ్లతో మనకు కావలసినది ఏమీలేదు. ఆ తరువాత దొరవారి చిత్తం," అని తన మనోభిప్రాయాన్ని వెల్లడించినాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Saptabhoomi**

* * *